TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేధికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 31 | ఎడిటర్ : కందాడి మహెందర్ రెడ్డి | బుధవారం 1 - 7 - 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- రైతు భరోసా నిధులు విడుదల.. 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి డబ్బులు**

- అన్నదాతలు ఆత్మగౌరవంతో బతికేలా, వ్యవసాయాన్ని ఒక పండుగలా తీర్చిదిద్దేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నాం
- సంక్షేమం, వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం
- గత పాలకులు పెట్టిన బకాయిలను కట్టే బాధ్యత తమ ప్రభుత్వంపై పడింది
- 'ప్రభుత్వం రాగానే తొలి విడతగా రూ.7 వేల కోట్లు ఇచ్చాం
- రాబోయే 9 రోజుల్లో మరో రూ.9 వేల కోట్లు రైతు భరోసా కింద చెల్లించడానికి నగదు సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్30,**

హైదరాబాద్ శిల్పాకళావేదికలో నిర్వహించిన సభలో రైతు భరోసా నిధుల పంపిణీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలో అన్నదాతలు ఆత్మగౌరవంతో బతికేలా, వ్యవసాయాన్ని ఒక పండుగలా తీర్చిదిద్దేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన వినాశనాన్ని సరిదిద్దుతూ, సంక్షేమం, వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి, పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావు కాలం నుండి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు (దాదాపు 60 ఏళ్లలో) తెలంగాణ అప్పు కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమేనని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.'జూన్ 2, 2014న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పుడు రూ.69 వేల కోట్ల అప్పు ఉంటే.. డిసెంబర్ 7, 2023న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి కల్వకుంట్ల కుటుంబం దానిని ఏకంగా రూ.8 లక్షల 11 వేల కోట్లకు చేర్చింది.





## వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

- వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి పిలుపు
- కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో ప్రసంగం

**గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి**

**అమరావతి,జూన్30,**

వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునర ుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపు నిచ్చారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాత కోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సా హం అందించిన తల్లిదండ్రులకు ఆమె శు భాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధిం చిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాల యాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు.



## విశాఖలో ఘనంగా గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం

- రాష్ట్రపతికి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 373 మంది విద్యార్థులకు పట్టాలు, 13 మందికి స్వర్ణ పతకాలు

**అమరావతి,జూన్30,**

విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ) తొలి స్నాతకోత్సవం మంగళవారం నాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలను బహూకరించారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

**తిరుమల శ్రీవారికి నిన్న రూ.5.63 కోట్ల హుండీ ఆదాయం**



**తిరుమల,జూన్30**

తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం లభించింది. సోమవారం ఒక్కరోజే శ్రీవారి హుండీకి రూ.5.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. నిన్న శ్రీవారిని మొత్తం 95,498 మంది భక్తులు దర్శించుకున్నారు.తిరుమల గిరులపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం 21 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ తెలిపింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం నాడు 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు.



## ఫడ్నవిస్ ను కలిసిన పవన్ కల్యాణ్

- తూర్పు కనుమల్లో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్న పవన్
- ఏపీకి రెండు ఆడ పులులు ఇచ్చేందుకు ఫడ్నవిస్ ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడి

**అమరావతి,జూన్30,**

ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా తూర్పు కనుమల్లో పులుల సంరక్షణతో పాటు ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల సంతానోత్పత్తి వంటి జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు.

## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్‌కి ఊరట

- హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు
- అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేలు పంచుతోందని ఆరోపించిన సంజయ్
- ఈ వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు



**హైదరాబాద్,జూన్30,**

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది.అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.

## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి

- రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!
- స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు

**హైదరాబాద్,జూన్30**

తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.





## మంత్రి శ్రీధర్ బాబు దంపతుల మార్ఫింగ్ వీడియో

- శ్రీధర్ బాబు, ఆయన భార్య శైలజా రామయ్యర్ ఫేక్ వీడియోను పోస్ట్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాది శశిభూషణ్
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



**హైదరాబాద్,జూన్30,**

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన భార్య, సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ దంపతులను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక మార్ఫింగ్ వీడియో కలకలం రేపుతోంది.

నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


# కార్మిక శాఖ లో నిధులు దారి మళ్లింపు ఆపాలి



-తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా లో
-భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య

**నమస్తే భారత్: మరిపెడ:** కార్మిక శాఖ వెల్ఫేర్ బోర్డు స్కీం లను ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అంటగడుతూ. కార్మిక శాఖ నిధులను దారుమర్లించి దుర్యోనియోగం చేస్తున్నారని భవన కార్మిక సంఘం సిఐటియు అనుబంధం మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కొండపల్లి కృష్ణవేణి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండ ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాలు భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్న పట్టించుకోవడంలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్విత, పాక్షిక అంగవైకల్యం లాంటి స్కీములను జీవో నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ 346.36 కోట్ల క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనని ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. సిఎస్ సి హెల్త్ కేర్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిర్మాణ రంగా కార్మికుల రెక్కల కష్టంతో పోగుపడ్డ సంపదను కార్మికుల సంక్షేమాన్ని కాకుండా ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం అన్యాయమని విమర్శించారు. అవసరం ఉన్నా లేకున్నా ప్రతి కార్మికుడు పేరు మీద 2వేల 309 ప్రీమియం చెల్లిస్తూ పోతే బోర్డు నిధులు రోజురోజుకు తరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిఎస్ సిహెల్త్ చెకప్ పేరుతో 750 కోట్లు కాజేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వాటిని ఆపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని కోరారు. లేనియెడల మంత్రులను ఎమ్మెల్యేలను గ్రామాలు తిరుగనీయకుండా, ఇందిరమ్మ ఇల్లు కట్టకుండా నివారిస్తామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి యాదగిరి, కే రాంబాబు, కే వెంకన్న, బిక్షం, సైదులు, రాములు, వాసు, వెంకన్న, బిక్కు, ముత్తిలింగం, వెంకట్ రాములు, ఎల్లయ్య, చిరంజీవి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు

# ప్రజల మన్ననలే ప్రభుత్వ ఉద్యోగికి నిజమైన సంపద

- 40 ఏళ్ల సేవలకు ఘన సత్కారం - పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన కలెక్టర్ మను చౌదరి
- హౌజింగ్ శాఖ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించిన కలెక్టర్ - ప్రజలకు మర్యాదతో సేవలందిస్తే చిరస్థాయిగా గుర్తుంటారని వ్యాఖ్య - కుటుంబ సభ్యులతో ఆనందంగా పదవీ విరమణ జీవితం గడపాలని ఆకాంక్ష




కుత్బుల్లాపూర్,జూన్ 30 (నమస్తే భరత్ ప్రభుత్వ ఉద్యోగంలో ప్రజలకు నిబద్ధతతో సేవలందించి, వారి మన్ననలు పొందడమే ఉద్యోగికి లభించే అత్యంత విలువైన సంపద అని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం, చేతనైన సహాయం అందిస్తే వారు జీవితాంతం గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణమూర్తి, కలెక్టర్ కాన్ఫిడెన్షియల్ సెల్ (సీసీ) బాల భాస్కర్, హౌజింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సుభాష్ రెడ్డి, కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్ జర్మియాజ్‌లను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విధుల్లో ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించడం, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని అన్నారు. ప్రజల ప్రశంసలు, వారి ఆశీర్వాదాలే ప్రభుత్వ ఉద్యోగికి నిజమైన గుర్తింపని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇందిరమ్మ ఇళ్లు, 2 బీహెచ్‌కే గృహాల పథకాల కోసం జిల్లాలో 30 నుంచి 40 వేల వరకు దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటి పరిశీలనలో హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణమూర్తి ఎంతో ఓర్పుతో, పారదర్శకంగా వ్యవహరిస్తూ అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేశారని ప్రశంసించారు. ప్రజల సొంతింటి కలను సాకారం చేయడంలో హౌజింగ్ శాఖ కీలక భూమిక పోషిస్తోందన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో విశిష్ట సేవలందించిన రమణమూర్తి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ, తన అభిరుచులకు అనుగుణంగా జీవితాన్ని ఆస్వాదించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ కాన్ఫిడెన్షియల్ సెల్‌లో పనిచేసిన బాల భాస్కర్ అధికారులకు, ప్రజలకు మధ్య సమన్వయ వారధిగా వ్యవహరించారని కొనియాడారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో ఓర్పుగా, ఆప్యాయంగా మాట్లాడి సమస్యల పరిష్కారంలో విశేష సేవలందించారని పేర్కొన్నారు. తనతో పనిచేసిన కాన్ఫిడెన్షియల్ సెల్ సిబ్బందిలో బాల భాస్కర్ అత్యుత్తమంగా విధులు నిర్వహించారని ప్రత్యేకంగా అభినందించారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ సేవలతో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చారని అన్నారు. వారి భవిష్యత్ జీవితం ఆరోగ్యంగా, ప్రశాంతంగా, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా అభినందించారు.

# సీకేఎం కళాశాలకు డాక్టర్ ధర్మారెడ్డి అందించిన సేవలు శ్లాఘనీయం



వరంగల్ జూన్ 30(నమస్తే భారత్): గత 36 ఏళ్లుగా సీకేఎం కళాశాలలో కెమిస్ట్రీఅధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్ గా పనిచేసి ఉన్నత విద్యారంగానికి ఆచార్య ఆంధ్రు ధర్మారెడ్డి అందించిన సేవలు ఎంతో శ్లాఘనీయమని వక్తలు కొనియాడారు. దేశాయిపేట లోని సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి పదవీ విరమణ సమావేశండాక్టర్ షేక్ అయేషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకతీయ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ విశ్రాంతాచార్యులు జగన్నాథ స్వామి మాట్లాడుతూ డాక్టర్ ధర్మారెడ్డి నిరంతరశీ శ్రమిస్తాడని నిబద్ధతకు నిలువుటద్దమని తెలిపారు. నా శిష్యుడుగా మంచి పరిశోధకుడిగా ఎదిగి ఉత్తమ అధ్యాపకుడిగా సేవలందించడం నాకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సీకేఎం కళాశాల అధ్యాపకుడిగా పాఠాలు చెప్పడంతో పాటు ఎన్నో సామాజిక సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ధర్మారెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ధర్మారెడ్డి తో అనుబంధం ఉన్న పలువురు విశ్రాంత ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు గుర్తుచేసి అభినందించారు. చివరగా సన్మాన గ్రహీత డాక్టర్. ధర్మారెడ్డి మాట్లాడుతూ మారుమూల కుగ్రామం నుండి రైతు కుటుంబం నుండి వచ్చి కష్టపడి చదువుకున్న నాకు సీకేఎంకళాశాల తనకు జీవితాన్ని అందించిందని అందుకు నేను సర్వదా రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కళాశాలలో సీనియర్ విశ్రాంత అధ్యాపకులు స్వర్గీయ జానకిరామ య్య, సుబ్బారావు, విశ్రాంతాచార్యులు జగన్నాధస్వామి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ సోమిరెడ్డి తదితరుల స్ఫూర్తితో బోధనతో పాటు సామాజిక సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని తెలిపారు. తన 36 ఏళ్ల ప్రస్థానం లో తన ఎదుగుదలకు కృషిచేసిన తల్లిదండ్రులు, బంధు మిత్రులు అందరికీ డాక్టర్ ధర్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డాక్టర్ ధర్మారెడ్డి ని శాలువ, జ్ఞాపికలు, ప్రశంస పత్రం అంద జేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలపూర్వ పాలకమండలి సభ్యులు చందా శ్రీకాంత్, సీకే ఏం కళాశాల పూర్వ అధ్యాపకుల సహకార సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుదర్శనరెడ్డి, పూర్వ ప్రిన్సిపాళ్ళు డాక్టర్ శశిధర్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ళు లెఫ్టినెంట్ బి. చంద్రమౌళి, ఆచార్య మల్లం నవీన్, ఆచార్య జి శ్రీనివాస్, ఆచార్య సంతోష్, కెప్టెన్ డాక్టర్ పి సతీష్ కుమార్ ,డాక్టర్ చిన్న , శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, పాషా, వివిధ కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు ఎన్సిసి క్యాడెట్లు ,తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన మహిళను కుటుంబానికి చేర్చిన పేట్ బషీరాబాద్ పోలీసులు

- మతిస్థిమితం లేక తిరుగుతున్న మహిళను గుర్తించిన స్థానికులు
- ఆశ్రమంలో చికిత్స అనంతరం వెల్లడైన అసలు వివరాలు
- భర్తను గుర్తించి సురక్షితంగా అప్పగించిన పోలీసులు
- పోలీసుల మానవత్వానికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు



కుత్బుల్లాపూర్, జూన్ 30 (నమస్తే భరత్ ): మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన ఓ మహిళను గుర్తించి, ఆమెకు చికిత్స అందించి చివరకు కుటుంబ సభ్యులను గుర్తించి అప్పగించడం ద్వారా పేట్ బషీరాబాద్ పోలీసులు తమ మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో అపర్ణ పామూరు ప్రాంతంలో ఓ మహిళ మతిస్థిమితం లేకుండా తిరుగుతుండటాన్ని స్థానికులు గమనించి డయల్-100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పేట్ బషీరాబాద్ పోలీసులు ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆమె ఎలాంటి సమాచారం చెప్పలేకపోయింది. అనంతరం పోలీసులు కేవీ రెడ్డి నగర్, గుండ్లపోచంపల్లి పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టినా ఆమెకు సంబంధించిన ఆచూకీ లభించలేదు. దీంతో అదే రోజు సాయంత్రం షామీర్‌పేట్‌లోని మాతృశ్రీ అనాథ ఆశ్రమంలో ఆమెను చేర్పించి వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. చికిత్స అనంతరం మహిళ తన పేరు పింకీ బై గోసాయి (30) అని, తన భర్త పేరు బబ్బులు (35) అని తెలిపింది. తాము వికార్‌బాద్ జిల్లా తాండూరు గాంధీనగర్‌కు చెందినవారమని వెల్లడించింది. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి తప్పిపోయి వచ్చినట్లు తెలిపింది. వెంటనే పోలీసులు ఆమె భర్తను సంప్రదించి ఆశ్రమానికి పిలిపించారు. అవసరమైన ధృవీకరణ ప్రక్రియ అనంతరం మహిళను భర్తకు సురక్షితంగా అప్పగించారు. తన భార్యను క్షేమంగా అప్పగించిన పేట్ బషీరాబాద్ పోలీసులకు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాద్ పోలీసుల తక్షణ స్పందన, మానవతా దృక్పథం, సేవా భావాన్ని స్థానికులు అభినందించారు.

# గ్రామ దేవత ఆశీస్సులతో ముందుకు సాగుదాం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్

## దూసకల్ గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయ పునః ప్రతిష్ట మహోతసంస్కృత

నమస్తే భారత్ షాద్ నగర్ జూన్30:ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలో బాగం కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ దేవతల ఆలయాలు గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ నిర్మాణం, పునః ప్రతిష్ట కోసం కృషి చేసిన బాగం కృష్ణయ్య యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించి, గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు భాగం కుమార్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు చాట్ల రమేష్, పాపయ్య యాదవ్, బాలు,



కావలి అశోక్ యాదవ్,శివ కుమార్, కె.విష్ణు, కుమ్మరి రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, బి. నర్సింలు, మల్లెల రవి, శంకరయ్య యాదవ్, శివ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన డిప్యూటీ కమిషనర్ వి. నర్సింహాకు ఘన వీడ్కోలు

-సుచిత్ర స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో సన్మాన సభ.. సహోద్యోగుల భావోద్వేగ వీడ్కోలు
-నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, ప్రజాసేవకు ప్రతీకగా కొనియాడిన అధికారులు




కుత్బుల్లాపూర్,జూన్ 30 (నమస్తే భరత్ ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో సేవలందించి, గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన సీనియర్ అధికారి వి. నర్సింహా మంగళవారం పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో సర్కిల్‌కు బదిలీపై వెళ్లిన ఆయన, అక్కడ కొద్ది రోజులపాటు విధులు నిర్వహించిన అనంతరం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో జీడిమెట్ల సర్కిల్ పరిధి సుచిత్రలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ హాజరై మాట్లాడుతూ, వి. నర్సింహా విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అంకితభావం ప్రతి ఉద్యోగికి ఆదర్శమని కొనియాడారు. ఉద్యోగ జీవితమంతా నిజాయితీతో విధులు నిర్వర్తించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల, గాజులరామారం, చింతల్ సర్కిళ్లకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నర్సింహాను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలు సంస్థకు చిరస్మరణీయంగా నిలుస్తాయని కొనియాడారు. కార్యక్రమం అనంతరం అందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పదవీ విరమణ జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.

# సహకార స్ఫూర్తితో రైతు అభివృద్ధికి సమష్టి కృషి

- ఆల్వాల్‌లో సహకార వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం
- సహకార చట్టాలు, రైతులకు లభించే ప్రయోజనాలపై అవగాహన
- ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పిలుపు
- పాల్గొన్న జిల్లా సహకార శాఖ అధికారులు, సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జూన్ 30 ( నమస్తే భరత్ ): జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల సందర్భంగా ఆల్వాల్‌లోని సిండికేట్ ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సంఘం ఆధ్వర్యంలో రైతులకు సహకార వ్యవస్థపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. సురేఖ రాణి మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సహకార నియమాలు, చట్టాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను సమర్థవంతంగా పొందవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) సభ్యత్వ నమోదును వేగవంతం చేసి మరింత మంది రైతులను సంఘటితం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి జి. శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ తోట గోపాల్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.ఎం.వి. ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు. వారు సహకార సంఘాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు, సహకార వ్యవస్థ బలోపేతం అవసరంపై రైతులకు వివరించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సహకార రంగానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.




# వాచ్య తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి

నమస్తే భారత్ :-మరిపెడ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బురాన్‌పురం గ్రామపంచాయతీ పరిధిలోని వాచ్ తండాలో బానోత్ బుజ్జి, కిరణ్‌ల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులను అభినందిస్తూ, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మరిపెడ మండల అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు బురాన్‌పురం గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల వెంకటమ్మ వెంకటయ్య కాంగ్రెస్ నాయకులు దశరథ్ నల్లు శ్రీకాంత్ రెడ్డి కొన్నె సోమన్న మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జరుపుల విజయ్ మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భానోత్ నరేష్ కుమార్ గారు, మరిపెడ మండల కోఆర్డినేటర్ అక్కినపల్లి వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!


దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్-అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది. కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్‌ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి. కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది. ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది. చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది. "దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం. సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విభేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది. బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది. నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమిలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి. కమ్యూనిస్టు పార్టీలకు అనేక ఆంక్షలు ఉన్నా శ్రామికుల సమ్మెలు, రైతాంగ ఉద్యమాలలో పార్టీ గ్రూపులు పనిచేస్తూనే వస్తున్నాయి.

# ఏఐతో భాషా ప్రావీణ్యం వస్తుందా?




మదిలోని భావాన్ని వ్యక్తపరచే వాహకమే భాష. ఇది నమ్మకాలను ప్రోదిచేస్తుంది. సంస్కృతిని నిర్మిస్తుంది. చరిత్రను ఆమోదిస్తుంది. ఒక జాతికి గుర్తింపు తెచ్చిపెడుతుంది. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. ఆ తర్వాత ఉత్తరం వచ్చింది. దాని తర్వాత వచ్చిన ఫోన్ మాట్లాడే దూరాన్ని చెరిపేసింది. దీనికి అదనంగా మెయిల్, వాట్సాప్ వంటి సమాచార సాధనాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇపుడు నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే, ఎన్ని సాధనాలు వచ్చినా భాష మాత్రం మారలేదు. అలానే ఉన్నది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే..కానీ ప్రేరణ అలానే నిలిచి ఉన్నది. కృత్రిమ మేధ ఇపుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరగ రాస్తున్నది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తున్నది. వ్యాసాలు రచిస్తున్నది. సంగీత బాణీలను కడుతున్నది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధ ట్యూటర్‌గా, అనువాదకునిగా, సహచరునిగానూ వ్యహరిస్తున్నది. తర్కం, స్థిరవ్యవస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజినీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే ఏఐ ప్రభావంతో రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఏఐ ద్వారా తక్షణమే పొందగలుగుతున్నాం. కథలు చెప్పగలిగేవారే ప్రపంచంలో అత్యంత శక్తిమంతులు అంటారు పెద్దలు. మాట అంత మహత్తరమైనది. భాష ఒక జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఏఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదం సాంకేతికంగా సరిగానే ఉండవచ్చు. అయితే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. ఆ ఉద్వేగ అనుభూతి యంత్రానికి సాధ్యం కాదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఏఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగా ఉంటుంది. కానీ పేలవం అనిపిస్తుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెప్తారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. మనలో విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తాయి. భాష నేర్చుకోవడంలో మెలకువలు నేర్పుతాయి. ఇది సజీవ శిక్షణ. ఆ సజీవతను ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు? కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడిని సరిచేస్తాయి. వ్యాకరణాన్ని వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని అందిస్తాయి. ఇవి టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. పాఠ్యప్రణాళిక రాసుకోవచ్చు, విద్యార్థుల నుంచి వేగంగా అభిప్రా యాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషాపటిమ ధారాళంగా మాట్లాడటం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే వస్తుంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం. గత కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లిష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైం ది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియో గం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి. ఇది సామాజిక సంబంధాల ను నిలిపే సాధనం. కానీ వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువచేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబ డుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమై ఉంటాయి. ఇదే నిజమైన భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నంతోనే భాషా పటిమ పట్టుబడుతుంది. ఈ సాధనే భాష సజీవంగా నిలిచి వెలిగేలా చేస్తుంది. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి.

# జీవన సాదృశ్యాలు జయంతి కథలు




ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రచయిత్రి-కవయిత్రి వాసరచెట్ల జయంతి సమాజంలోని సమస్యలపై స్పందిస్తూ తన సంఘర్షణ, ఆర్ద్రత, ఆందోళన, ఆలోచన, ప్రతిఘటనను సాంద్రంగా వినిపిస్తూ..'నేలవిమానం', 'తురాయిపూలు' శీర్షికలతో రెండు కవితా సంపుటాల్ని వెలువరించి, కవయిత్రిగా తన తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. శర్వమ్మ పేరు-ప్రాధాన్యత: రచయిత్రిగా ఆవిష్కరించిన తొలికథల సంపుటి 'శర్వమ్మ మరణం' తోపాటు మొత్తం 19 కథలు ఉన్నాయి. ప్రతి కథ ఒక జీవితమే. జీవితాల్లోంచి పుట్టుకొచ్చినదే! రచయిత్రి తన అనుభవంలో చూసిన, విన్న, అంశాలనే తన కథలకు ఇతివృత్తాలుగా చేసుకుని, కొంత కల్పన జోడించి సగటు సజీవ జీవన చిత్రాలను తనదైన శైలిలో చిత్రిస్తూ వచ్చారు. ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి ఈ కథలకు ప్రామాణికమైన ముందు మాటలు అందించారు. మ్యారేజి బ్యూరోల్లో కొందరు అబ్బాయిలు తప్పుడు వివరాలు ఇచ్చి, అమ్మాయిల జీవితాలతో ఆడుకునే పరిస్థితుల్ని 'తూరుపు సిందూరం' కథ కండ్లకు కట్టినట్టుగా చూపెట్టారు. కథలో కథానాయిక మోసాన్ని ధైర్యంగా జయించి ఆత్మవిశ్వాసంతో నిలబడుతుంది. ఆర్థిక బలహీనులు ఆత్మీయులు అయినప్పటికీ వారి స్వేచ్ఛను, స్వతంత్రాన్ని హరిస్తూ... వాళ్ల బతుకుల్ని ఎదుటివాళ్లు ఏవిధంగా కబ్జా చేస్తుంటారో 'ఒక చేతివేళ్లు' కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆర్తి లోంచి, ఆవేదన లోంచి, మేలుకుని..కోలుకుని.. ఆత్మవిశ్వాసం వైపుగా ప్రయాణించిన కథ 'కొడిగట్టిన దీపం'. తోడు వీడి వెళ్లాక కథలో భర్తను కోల్పోయిన ఒక స్త్రీ, తనదైన ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితం ప్రారంభించి, భర్త కలల్ని నెరవేర్చిన తీరు కనిపిస్తుంది. బాధ్యత లేని సంతానానికి గుణపాఠం నేర్పుతూ ఆస్తిని చట్టబద్ధంగా అనాథలకు రాసిచ్చిన కథ 'శర్వమ్మ మరణం'. శర్వమ్మ వీలునామా/ శర్వమ్మ నిర్ణయం వంటి పేర్లు కూడా ఈ కథకు సరిపోతాయి. కానీ 'శర్వమ్మ మరణం' పేరే సరైనది. ఆమె చావు కోసం ఎదురుచూస్తూ... ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించిన కుటుంబ సభ్యులకు, ఆమె మరణం తర్వాత ఎదురయ్యే కోలుకోలేని దెబ్బ... ఆస్తి దక్కకుండా పోవడం. ఆమె చావు కోసం ఎదురుచూసిన వాళ్లే జీవచ్ఛవాలు అయిపోతారు. ప్రాంక్ వీడియోలు, ప్రాంక్ కాల్స్ వల్ల బలహీన మనస్కులకు ఎదురయ్యే ప్రమాదం గురించిన హెచ్చరించిన కథ-వినదగునెవ్వరు చెప్పిన. 'కొత్తతరం' కథ ఒక చైతన్య స్రవంతి. ఈ కథలో రేవతి అనే గ్రామీణ బాలిక తన టీచర్ ద్వారా ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార బ్యాగులు వాడొచ్చని తెలుసుకోవడం, ప్రకృతి పర్యావరణ సందేశాన్ని వ్యాపింపజేయడం ఇందులో కథాంశం. ఫలితంగా అమ్మాయి నివసించే పాలమూరు జిల్లాలో ఉన్న 'సిద్దాయిపల్లె' గ్రామం పేరు హైదరాబాద్‌లో మార్మోగుతుంది. ఇంకా 'ఎండమావి', 'తండ్రి ఋణం', 'సంభవామి యుగేయుగే', 'దిగ్బంధనం' వంటి మనసుకు హత్తుకునే, ఆలోచింపజేసే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. జయంతి కథల్లో సమస్త జీవన విలువలు కనిపిస్తున్నప్పటికీ, పాత్రలన్నీ మన ఇరుగుపొరుగు వ్యక్తులుగా మనసుకు పరిచయం అవుతున్నప్పటికీ కథల్లో పాలమూరు ప్రాంతీయ జీవన విధానానికి పెద్దపీట వేశారు. అలాగే కథా సందర్భాన్ని అనుసరించి కులాలు-కులవృత్తుల్ని కూడా ప్రవేశపెట్టారు. రచయిత్రిగా జయంతి వాసరచెట్ల పాఠకుల హృదయానికి చేరువయ్యే కథల్ని సృజించారు. ఇందులో కొన్ని కథలు కథ ముగిసిన తర్వాత కూడా మనసును వెంటాడుతాయి. రాసిన ప్రతి కథలో ఒక అర్థాన్ని లేదా ఒక సందేశాన్ని లేదా ఒక పరమార్థాన్ని అందించిన జయంతి రచయిత్రిగా ఈ కథల ద్వారా తన పరిపూర్ణత ప్రదర్శించారని చెప్పవచ్చు. అందరూ తప్పకుండా పుస్తకం కొని చదవాల్సిన కథలు ఇవి. ప్రతులకు: వాసరచెట్ల జయంతి (9985525355).

# అక్రమ వెంచర్లు.. అడ్డగోలు విక్రయాలు?



నల్లగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీ పేట గ్రామంలో సర్వేనెంబర్ 92 లో ఫామ్ ల్యాండ్ ప్లాట్లతో కూడిన వెంచర్ ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ లో 121 గజాల తో ప్లాట్లు లే అవుట్, 30 ఫీట్ల తో రోడ్లు నిర్మించారు. ఈ ప్లాట్ లలో దాదాపు పది రకాల మొక్కలను పెంచుతున్నారు. వాటిల్లో మామిడి, సపోటా, బత్తాయి, దానిమ్మ బొప్పాయి, పనస, జామ పండ్ల మొక్కలను డ్రిప్ సిస్టం ద్వారా నీరు సరఫరా చేసి మొక్కలను కాపాడుతున్నారు . సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అనువైన ధరలో ప్లాట్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, సోషల్ మీడియా లో ఫేస్బుక్ వేదికగా అందమైన వీడియోలు తీసి విక్రయానికి పెట్టారు. “” వి జె ఆర్ డెవలపర్స్”” పేరుతో కొన్ని ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతి లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడానికి అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యాపారానికి తెరలేపారు.

వెంచర్లు చేయాలంటే నిబంధనలు..: భూమి వ్యవసాయ భూమి అయితే, దానిని నాన్-అగ్రికల్చరల్ ఉపయోగం కోసం మార్చడానికి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుండి అనుమతి తీసుకోవాలి. లే అవుట్ ప్లాన్‌ను స్థానిక అధికారులు లేదా డెవలప్‌మెంట్ అథారిటీ ఎవీణూ, ఋడ్రూ, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదించాలి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (DTCP) లేదా స్థానిక పంచాయతీ అధికారుల నుండి అనుమతి అవసరం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA),లే అవుట్ ప్లాన్‌లో రోడ్లు, ఓపెన్ స్పేస్‌లు, డ్రైనేజీ, నీటి సరఫరా వంటి సౌకర్యాలకు సంబంధించిన నిబంధనలు పాటించాలి. రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్, 2016ప్రకారం, 500చదరపు మీటర్లు లేదా8 ప్లాట్‌లకు మించిన లే అవుట్ ప్రాజెక్ట్‌లు రాష్ట్ర RERA పోర్టల్‌లో నమోదు చేయాలి. RERA నమోదు కస్టమర్లకు పారదర్శకతను నిర్ధారిస్తుంది. చట్టపరమైన రక్షణను అందిస్తుంది. ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్, భూమి పర్యావరణ సున్నితమైన ప్రాంతంలో ఉంటే ( నీటి వనరులు, అడవుల దగ్గర), స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (SEIAA) నుండి అనుమతి ఉండాలి. లే అవుట్‌లో భవన నిర్మాణాలు ఉంటే, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ నుండి చీూజ తీసుకోవాలి. స్థానిక పంచాయతీ/మున్సిపల్ అనుమతులు,స్థానిక గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుండి లే అవుట్ అనుమతి తీసుకోవాలి, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాల కోసం కొన్ని సందర్భాల్లో, భూమి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే, పంచాయతీ నుండి అనుమతి తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిర్దిష్ట గవర్నమెంట్ ఆర్డర్‌లు (GOs) లేదా రెగ్యులేషన్‌లకు అనుగుణంగా ఉండాలి. ఉదాహరణకు, అనుమతి లేని లే అవుట్‌లలో ప్లాట్లు కొనడం వల్ల కొనుగోలుదారులు ఇబ్బందులు పడవచ్చు. RERA పోర్టల్‌లో వెంచర్ నమోదైందా? నిర్ధారించుకోవాలి. ఇవన్నీ పాటించకుండానే కోట్ల రూపాయల కొల్లగొట్టి ప్రజలను మోసం చేస్తున్న వెంచర్లపై రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎలాంటి పర్మిషన్లు లేవు...!: వెంచర్ చేయాలంటే డిటి సిపి, రేరా గ్రామపంచాయతీకి 10% ల్యాండ్ మార్టిగేజ్ చేసిన తర్వాత రోడ్లు, విద్యుత్తు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇతర పనులు డెవలప్మెంట్ చేసి ప్లాట్లు విక్రయించాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయడం ఎందుకు అని అడ్డదారిలో ప్లాట్లు అమ్మే సౌకర్యాన్ని “ వి జె ఆర్ డెవలపర్స్” పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెరదీశారు. అందమైన బ్రోచర్లతో వల: అందమైన బ్రోచర్లు, లే అవుట్ ప్లాన్ తో అమ్మడానికి సిద్ధమైన వెంచర్ బాగోతం అంతా ఇంతా కాదు.

# భారీగా పెరగనున్న ధరలు..!

## 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ



హైదరాబాద్, : తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది.ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది.అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలోబహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ. 12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600 గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు పరిధి ప్రామాణికంగా ధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు.అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం రెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు.


## అమరావతి ఓఆర్ఆర్ 250 అడుగులు

అమరావతి : ఏపీ రాజధాని అమరావతికి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసి భూమిని సేకరిస్తున్నారు.ఈ క్రమంలో ఓఆర్ఆర్ భూసేకరణ 140 మీటర్ల వెడల్పు బదులు 250 మీటర్ల వెడల్పు కోసం చేపడుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా.. అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆందోళన అవసరం లేదన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అన్ని జిల్లాలు కనెక్ట్ చేసేలా ఔటర్ రింగ్ రోడ్డు రాబోతోంది. అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించి భూసేరణ ప్రక్రియ కూడా చేపట్టారు. గుంటూరు, పల్నాడుతో పాటుగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే ఓఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారని ప్రతిపాదించారు. అయితే అమరావతి ఔటర్‌కు సంబంధించిన గెజిట్‌లో మాత్రం 250 మీటర్లుగా పేర్కొన్నారట. దీంతో రైతులు అధికారుల్ని అడిగి క్లారిటీ తీసుకుంటున్నారట.. 250 మీటర్లు ముందు జాగ్రత్త మాత్రమేనని.. ఓఆర్ఆర్‌ను మాత్రం 140 మీటర్ల వెడల్పుతోనే నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారట. మామూలుగా అధికారులకు 3ఏ నోటిషికేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా భూమి సర్వేకు హక్కు ఉండదు అంటున్నారు. అప్పుడు కొలతలు తీసి హద్దులు వేయలేరని.. జీపీఎస్‌పై ఆధారపడాలి అంటున్నారు. జీపీఎస్‌ను 140 మీటర్ల వెడల్పు ప్రామాణికంగా తీసుకుని హద్దులు నిర్ణయిస్తే.. కొన్ని చోట్ల 5 నుంచి 10 మీటర్లు తేడా వస్తుంది అంటున్నారు. అదే జరిగితే ఈ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని.. ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందంటున్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొన్నారట. భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత సర్వే పూర్తి చేసిన అనంతరం 140 మీటర్లకే కొలత వేసి సరిహద్దులు వేస్తారు. ఆ మేరకు మాత్రమే భూమిని కూడా తీసుకుంటారు.. ఈ అంశాలను తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారని చెబుతున్నారు. ఎవరికి ఆందోళన అవసరం లేదంటున్నారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో భూసేకరణ కోసం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో ఓఆర్ఆర్ 140 బదులుగా 250 మీటర్ల భూసేకరణ ఉంటుందని పేర్కొన్నారు. అందుకే రైతులు ఒకింత ఆందోళనలో ఉన్నారట. 140 కాకుండా 250 తీసుకుంటే తాము నష్టపోతామన్నది రైతుల వాదన.. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన అవసరం లేదంటున్నారు. రైతులకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదని.. 140 మీటర్ల భూమి మాత్రమే తీసుకుంటామన్నారు.

# రాజీవ్ స్వగృహ తో రూ. 83 కోట్లు

హైదరాబాద్, : హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలానికి భారీ స్పందన లభించింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని తొర్రూరు, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి లేఅవుట్లలోని మొత్తం 85 ప్లాట్లకు నిర్వహించిన ఈ వేలంలో బిడ్డర్లు పోటీ పడి కొనుగోలు చేశారు. నిర్దేశించిన కనీస ధర కంటే అదనపు ధరలు పలకడంతో ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.83 కోట్ల మేర భారీ ఆదాయం సమకూరింది. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలలో ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములకు మార్కెట్‌లో ఎంతటి భారీ డిమాండ్ ఉందో మరోసారి రుజువైంది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ లేఅవుట్లలో ఉన్న ఓపెన్ ప్లాట్ల విక్రయానికి నిర్వహించిన బహిరంగ వేలానికి బిడ్డర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రాంతాలైన తొర్రూర్‌లో 66 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 11 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 8 ప్లాట్లతో కలిపి మొత్తం 85 ఓపెన్ ప్లాట్లకు ఈ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్‌పేటలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేలం ప్రక్రియలో కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థిరాస్తి రంగానికి ఉన్న క్రేజ్ కారణంగా.. చదరపు గజానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర కంటే బిడ్డర్లు చాలా ఎక్కువ మొత్తాన్ని పాడుకుని ప్లాట్లను సొంతం చేసుకున్నారు. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ వెల్లడించారు.ఈ బహిరంగ వేలంలో ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉన్న తొర్రూర్ లేఅవుట్‌లో రికార్డు ధర పలికింది. ఇక్కడి ప్లాట్లను దక్కించుకోవడానికి బిడ్డర్లు ఒకరితో ఒకరు తీవ్రంగా పోటీ పడ్డారు. తొర్రూర్‌లో 200 నుంచి 700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు గానూ.. ప్రభుత్వం చదరపు గజానికి కనీస ధరగా రూ.25 వేలు నిర్ణయించింది. అయితే ఇక్కడ సగటున చదరపు గజానికి రూ.32, 500 ధర లభించగా.. అత్యంత గరిష్ఠంగా ఒక ప్లాట్ ఏకంగా రూ.45,500 పలుకడం విశేషం. ఐటీ రంగానికి దగ్గరగా ఉండటం భవిష్యత్తులో వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉండటమే ఈ స్థాయి పోటీకి కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మరోవైపు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న కుర్మల్‌గూడ లేఅవుట్‌లో కూడా ల్యాండ్ వాల్యూస్ భారీగా పెరిగాయి. ఇక్కడ 200 నుండి 400చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లకు చదరపు గజం కనీస ధర రూ.20 వేలుగాగా ప్రభుత్వం నిర్దేశించగా.. వేలంలో గరిష్ఠంగా రూ.27,500 వరకు ధర పలికింది. అలాగే ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న మేడ్చల్ పరిధిలోని బహదూర్‌పల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు సైతం కొనుగోలుదారులు భారీగా పోటీ పడ్డారు. ఇక్కడ 200 నుంచి 1000చదరపు గజాలవిస్తీర్ణంలోని పెద్దప్లాట్లకు మార్కెట్ లో మంచి ఆదరణ లభించింది. బహదూర్‌పల్లిలో చదరపు గజానికి కనీస ధర రూ.27 వేలుగా నిర్ణయించగా.. బిడ్డర్లు పోటీ పడటంతో అది గరిష్ఠంగా రూ.40,500 ధర పలికింది. ప్రభుత్వ లేఅవుట్లలో క్లియర్ టైటిల్స్, మౌలిక వసతులు ఉంటాయనే నమ్మకంతోనే ప్రజలు బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ ధరకైనా కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారని అధికారులు వెల్లడిస్తున్నారు.

# టీడీపీలో షాడోల రాజ్యం



విజయనగరం, : విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం అంటే గుర్తుకు వచ్చేది పూసపాటి వారి కుటుంబమే. మూడు తరాలుగా వారు ఎమ్మెల్యేలుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. పీవీజీ రాజుతో మొదలైన వారి ప్రజా ప్రాతినిధ్యం ఆయన మనవరాలు అదితి గజపతిరాజు దాకా కొనసాగుతోంది. మధ్యలో అశోక్ గజపతి రాజు ఏడు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. ఇపుడు ఆయన గోవా గవర్నర్ గా రాజ్యాంగ బద్ధ బాధ్యలతో బిజీగా ఉన్నారు. ఆయన కుమార్తెగా వారసురాలిగా 2019లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన అదితి గజపతి రాజు ఆ ఎన్నికల్లో ఓటమి పాలు అయినా 2024 లో గెలిచి తన సత్తా చాటుకున్నారు. ఇక గెలిచిన తరువాత ఎమ్మెల్యే పెద్దగా జనంలోకి రారు అన్న విమర్శలు అయితే వినిపిస్తున్నాయి. నిత్యం ప్రజలతో మమేకం కావాలని పార్టీ ఆదేశాలు ఒక వైపు ఉంటే ఎమ్మెల్యే మాత్రం తనదైన శైలిలో రాజకీయం చేస్తున్నారు అని అంటున్నారు. ఆమెకు పార్టీలో ఇద్దరు కీలక నేతలు షాడోలుగా మారారని అంటున్నారు. జనంలో ఏ మాత్రం పలుకుబడి లేని ఈ ఇద్దరు నాయకులలో ఒకరు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన వారు అయితే మరొకరు సెటిల్మెంట్స్ చేస్తూ ఏకంగా ఎమ్మెల్యే దగ్గర తన పలుకుబడి పెంచుకుని అతి ముఖ్య సలహాదరుగా మారిపోయారని అంటున్నారు. ఇపుడు సీన్ ఎలా ఉంది అంటే ఈ ఇద్దరి సలహా సంప్రదింపులు లేకుండా ఎమ్మెల్యే కనీసం ఏదీ వినే పరిస్థితి లేదని సొంత పార్టీలోనే గుసగుసలు పోతున్నారు. ఇదే ఇపుడు ప్రచారంలో కూడా ఉంది. పర్యవసానంగా అంతా వారే అన్నట్లుగా పరిస్థితి మారింది. వారు ఏమి చెబితే అదే జరుగుతోందని ఒక విధంగా షాడో ఎమ్మెల్యేలుగా వారు మారిపోయారని అంటున్నారు. ఇక ప్రతీ విషయం వారు కనుసన్నలలోనే సాగుతోందని వారికి తెలియకుండా ఎమ్మెల్యే కూడా ఏమీ చేయడం లేదని అంటున్నారు. దీతో ఉద్యోగుల బదిలీల నుంచి కాంట్రాక్టుల కేటాయింపులు అధికారిక వ్యవహారాలు అన్నీ కూడా ఈ ఇద్దరే చక్కదిద్దుతున్నారని అంటున్నారు. వీరి వల్ల మేలు జరగకపోగా పార్టీకి చెడ్డ పేరు వస్తోందని ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఇక అశోక్ గజపతి రాజు అయితే అనునిత్యం కార్యకర్తలతో మమేకం అయ్యేవారు. ఆయనకు క్షేత్ర స్థాయిలో జరిగే ప్రతీ విషయం మీద అవగాహన ఉండేదని అంటున్నారు. అందుకే ఆయన సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా గెలిచి జనం గుండెలలో నిలిచారు అని అంటున్నారు. దానికి భిన్నంగా వారసురాలి పాలన సాగుతోంది అని అంటున్నారు.

# గీతంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ సదస్సు

### ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ అరవింద్ సహాయ్, ముఖ్య వక్తగా డాక్టర్ ఇమంది శంకరరావు

పటాన్ చెరు: భారత దేశంలో ప్రాక్టీస్-ఆధారిత విద్య యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లోని స్కూల్ ఆఫ్ బిజినెస్ జూన్ 26-27 తేదీలలో పాప్ కాన్ 2026 పేరిట ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ రెండు రోజుల సదస్సును నిర్వహించనుంది. ఆచరణాత్మక విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల కోసం భారతదేశపు మొట్టమొదటి ప్రత్యేక సదస్సు గా దీనిని అభివర్ణిస్తూ, గీతం సెంటర్ ఫర్ బిజినెస్ ఎంగేజ్ మెంట్ చైర్ పర్సన్ డాక్టర్ జోసెఫ్ పాల్ గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సు దేశంలో ఆచరణాత్మక విద్యావేత్తల కోసం ఒక జాతీయ ఉద్యమానికి నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సుకు మేనేజ్ మెంట్ డెవలప్ మెంట్ ఇన్ స్టిట్యూట్ గుర్గావ్ డైరెక్టర్, బిర్లాను లిమిటెడ్, టాటా ఏఐఏ, మ్యాటర్, బ్రాండ్ స్కేప్స్, వర్ధమాన్ లలో స్వతంత్ర డైరెక్టర్ గా ఉన్న ప్రొఫెసర్ అరవింద్ సహాయ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఎండీఐ గుర్గావ్ మాజీ చైర్మన్, జీఎంఆర్ గ్రూపు స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ ఇమంది శంకరరావు ముఖ్య వక్తగా కీలకోపన్యాసం చేయను న్నట్టు ఆయన తెలియజేశారు. ఆచరణాత్మక విద్యకు భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని, పరిశ్రమ నైపుణ్యాన్ని విద్యా రంగానికి తీసుకు వచ్చే నిపుణులకు అవసరమైన పరికరాలను అందించడానికి, వారిని అనుసంధానించడానికి, సాధికారత కల్పించ డానికి పాప్ కాన్ 2026 రూపొందించామన్నారు. ఈ సదస్సులో ప్యానెల్ చర్చలు, నిపుణుల ప్రసంగాలు, కీలకోపన్యాసాలు, కార్యశాల లు, నెట్ వర్కింగ్ అవకాశాల ద్వారా ఆచరణాత్మక నిపుణులు, విద్యావేత్తల ప్రత్యేక సమ్మేళనం ఉంటుందని డాక్టర్ జోసెఫ్ తెలిపారు. పరిశ్రమ నుంచి విద్యారంగానికి మారడం, ఆచరణాత్మక నిపుణుల అంతర్దృష్టులను విద్యాపరమైన కఠినత్వంతో అనుసంధానించడం, కేస్ స్టడీస్, కేస్ లెట్లకు సహకరించడం, విద్యా రంగంలో వృత్తి అవ కాశాలను అన్వేషించడం, నిర్మాణాత్మక పరివర్తన ప్రణాళికలను రూపొందించడం, ఉన్నత విద్యలో ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రను అర్థం చేసుకోవడం వంటివి ఈ సదస్సులోని ముఖ్యాంశాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యా వేత్తలు, ఆచరణాత్మక నిపుణుల మధ్య పరిచయాలు, సహకారం, పరస్పర సంభాషణకు కూడా వీలుకల్పిస్తుందన్నారు.

# ఎమ్మెల్యే పై అసత్య ప్రచా రాలు మానుకోవాలి



లింగంపేట : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పై బీఆర్ఎస్ కు చెందిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారం చేస్తున్నాడని, అసత్య ప్రచారాలను మానుకొని అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొల్ల సాయిరాం యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గొల్ల సాయిరాం యాదవ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తన ఐదేళ్ల పదవీకాలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు రెండున్నర ఏళ్ల వ్యవధిలో నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాడని ఆయన అన్నారు. గత ఏడాది ఆగస్టులో కురిసిన వర్షాలకు మండలంలోని కన్నాపూర్, లింగంపల్లి గ్రామాల చెరువులు వరద ఉధృతికి కొట్టుకుపో యా యని అన్నారు. కొట్టుక పోయిన చెరువుల మర మతు పనులు చేసేందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నిధులు మంజూరు చేయించాడని, వారం పది రోజుల్లో పనులు ప్రారంభ మవుతాయని ఆయన చెప్పారు.కేవలం రాజకీయ లబ్ధి కోసమేమాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ కన్నా పూర్ చెరువులో బీఆర్ఎస్ నాయకులతో, కొంత మంది రైతులతో కలిసి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పై అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేపడుతున్న అభివృ ద్ధి పనులను తెలుసుకొని మాట్లాడాలని, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరిం చారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు వంజరి ఎల్లమయ్య మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రా వు అభివృద్ధిలో " సాఫ్ట్ వేర్ కాదని హార్డ్ వేర్ " అని అన్నారు. అభివృద్ధి పనుల కోసం తానే సరదాగా ప్రతిపాదనలు తయారు చేసుకొని సంబంధిత శాఖల ఉన్నతాధికారుల వద్దకు, మంత్రుల వద్దకు వెళ్లి పట్టుబట్టి మరి నిధులను మంజూరు చేయిస్తారని అన్నారు. రెండున్నర ఏళ్ల కాలంలో మదన్ అన్న చేసిన అభివృద్ధి పనులను ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే కూడా చేయలేదని అన్నా రు. నియోజకవర్గ ప్రజల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతూ నిధులు రాబడుతున్న ఘనత మదన్మోహన్ రావుకే దక్కుతుందని ఆయన అన్నారు.అలాంటి ఎమ్మె ల్యేపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రాజ కీయ లబ్ధికోసం ఎమ్మెల్యే ను విమర్శించడం తగదని ఆయన అన్నారు. చెరువు తూము మరమ్మతుల కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గత ఏడాది రూ.30 లక్షలు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. కొట్టుకపోయిన చెరువు కట్టల మరమ్మ తుల కోసం ఇటీవలనే నిధులు మంజూర య్యా యని మరో 10 రోజుల్లో పనులు ప్రారంభమైతా యని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇస్తే స్వాగతిస్తామని, విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆయన చెప్పారు. ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బుర్ర నార గౌడ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ యుద్దీన్,ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు సక్రూ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి అబ్దుల్ వాహాబ్, శేవ్య నాయక్, లింగంపేట సర్పంచ్ కౌడ రవి, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్ , మండలంలో ని ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్ లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..


బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలాజలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్దకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగా శక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియం విరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# పొట్టను పట్టించుకుందాం



మన శరీరాలకు పోషణ మనం తినే ఆహారం నుంచే లభిస్తుంది. శరీరం బాగుండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడు చాలామంది జంక్ ఫుడ్, రిఫైన్డ్ పిండి, చక్కెరలు, ఉప్పు, రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ఇలాంటి ఆహారాలు జీర్ణ సమస్యలతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలకు బాటలు వేస్తాయి. అంతేకాదు మసాలా, వేపుడు ఆహారాలు కూడా పొట్టలో అసౌకర్యం కలుగజేస్తాయి. కాబట్టి, పొట్టకు మేలు చేసే ఆహారాన్ని మన భోజనంలో భాగం చేసుకోవాలి.

యోగర్ట్: పొట్ట ఆరోగ్యానికి యోగర్ట్ మంచి ఆహారం. రోజూ యోగర్ట్ తీసుకోవడంవల్ల జీర్ణ సమస్యలనుఅధిగమించవచ్చు. ఉదయం వేళలో, మధ్యాహ్నం భోజన సమయంలో యోగర్ట్ తీసుకోవడం మంచిది.

హోల్ గ్రెయిన్స్: ముతక ధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్) పొట్టకు మేలుచేసేవిగా పరిగణిస్తారు. గోధుమలు, ఓట్స్, బియ్యం, ఇతర హోల్‌గ్రేన్స్ నుంచి ఆహారం తీసుకోవాలి. ఇవి పొట్టకు మంచివి. వీటిలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

అరటిపండు: బాగా మాగిన అరటిపండు పొట్టకు ఎంతో మేలుచేస్తుంది. ఇందులో పొటాషియం ఉంటుంది. అరటిపండు తినడం వల్ల అరుగుదల మెరుగుపడుతుంది.

ఎన్నో పొట్ట సమస్యలు కూడా పారిపోతాయి. అరటిపండు తినడం పొట్టకు సంబంధించిన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలను తగ్గిస్తుంది. పొప్పడిపండు: పొప్పడిపండు అరుగుదలకు సహాయకారిగా ఉంటుంది. పొట్టను శుభ్రం చేసే పోషకాలకు ఇది గని. అలా పొప్పడిపండు మలబద్ధకాన్ని నివారిస్తుంది. అరుగుదల మొదలుకుని గుండెలో మంట, అజీర్తి తదితర సమస్యలను దూరం చేస్తుంది. అల్లం: అల్లాన్ని పొట్టకు మేలుచేసేదిగా పరిగణిస్తారు. వికారం, కడుపునొప్పితో బాధపడుతున్నవాళ్లకు అల్లం మంచిది. రోజువారీ గా భోజనంలో ఏదో విధంగా అల్లాన్ని చేర్చుకోవడం మంచిది.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!



జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదు లో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతా యి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది.

# వేప పండ్ల గురించి ఈ నిజాలు తెలుసా..?

### ప్రకృతి మనకు అందించిన ఆరోగ్య ప్రదాయిని ఇవి..!

వేప చెట్టు లేని ఊరిలో అసలు ఉండకూడదు.. అని మన పూర్వీకులు చెబుతుండేవారు. ఎందుకంటే ఆయుర్వేద ప్రకారం వేప అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ చెట్టులోని ప్రతి భాగం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకనే మన పెద్దలు వేప చెట్టు గురించి అంత గొప్పగా చెబుతుండేవారు. వేప చెట్టుకు చెందిన ఆకులు, బెరడు, పువ్వులు.. ఇలా అన్నీ ఉపయోగకరమే. అలాగే వేప పండ్లు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వేప పండ్ల నుంచి నూనెను తీసి ఉపయోగిస్తుంటారు. వేప పండ్లను కొందరు ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్ రూపంలో తింటారు. వే పండ్లను నేరుగా తింటే చేదుగా ఉంటాయి. కనుక వాటిని ఎండ బెట్టి తినవచ్చు. వేప పండ్లను తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.


నులి పురుగుల సమస్యకు..: వేప పండ్లలో యాంటీ వార్మ్ గుణాలు ఉంటాయి. అంటే పొట్టలో నులి పురుగులు ఉన్నవారు ఈ పండ్లను తింటే ఆ పురుగులు నశిస్తాయి. వేప పండ్లలో ఉండే సమ్మేళనాలు పొట్టలో ఉండే పురుగులను చంపేస్తాయి. దీంతో నులి పురుగుల సమస్య నుంచి బయట పడవచ్చు. పెద్దలకే కాదు ఈ చిట్కా పిల్లలకు కూడా మేలు చేస్తుంది. వేప పండ్లలో యాంటీ మలేరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తీసుకుంటే మలేరియా నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ పండ్లలో ఉండే సమ్మేళనాలు మలేరియాకు కారణం అయ్యే క్రిములను చంపేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. వేప పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

చర్మ సమస్యలకు..: వేప పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలపై పడే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలు సురక్షితంగా



ఉంటాయి.క్యాన్సర్, గుండె జబ్బులవంటి ప్రాణాంతకవ్యాధులు రాకుం డా అడ్డుకోవచ్చు. వేప పండ్ల గుజ్జును రాస్తుంటే ఎలాంటి చర్మ సమస్యలు అయినా ఇట్టే తగ్గిపోతాయి. గజ్జి, తామరతోపాటు చర్మంపై వచ్చే దురదలు, దద్దుర్లు తగ్గిపోతాయి. వేప పండ్లలో యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. వేప పండ్లు అందుబాటులో లేకపోతే వాటి నుంచి తీసిన నూనెను కూడా చర్మ సమస్యలను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. జీర్ణ వ్యవస్థకు..: వేప పండ్లను తింటుంటే జీర్ణ వ్యవస్థకు ఎంతగానో మేలు జరుగుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం నుంచి బయటపడతారు. గ్యాస్,అసిడిటీ, కడుపుఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా మారుతుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు వేప పండ్లలో ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. వేప పండ్లను రోజూ తింటుంటే రక్తంశుద్ధి అవుతుంది.దీంతో రక్త సంబంధ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వేప పండ్లలో సహజసిద్ధమైన ఇన్‌సెక్టిసైడల్ గుణాలు ఉంటాయి. అంటే ఈ పండ్ల ద్వారా పురుగులు, క్రిమి కీటకాలను నాశనం చేయవచ్చు. ముఖ్యంగా వ్యవసాయం చేసేవారికి ఈ పండ్లు సహజసిద్ధమైన ఎరువుగా, పోషక పదార్థంగా ఉపయోగ పడతాయి. దీంతో పంటను నాశనం చేసే పురుగులు, క్రిమికీటకాలు నశిస్తాయి. అలాగే పంటకు పోషణ లభించి దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలా వేప పండ్లతో అనేక లాభాలను పొందవచ్చు.

# మన చుట్టూ పరిసరాల్లోనే కనిపించే పువ్వులు ఇవి..



### విడిచిపెట్టకుండా తెచ్చి వాడండి.. ఎందుకంటే..?

చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా నీలి రంగులో ఉండే ఈ పువ్వులను మీరు గమనించారా..? ఇవి మన చుట్టూ పరిసరాల్లోనే కనిపిస్తుంటాయి. శంఖపుష్పి అనే తీగ జాతికి చెందిన మొక్కకు ఈ పువ్వులు పూస్తాయి. ఈ పువ్వులు తెలుపు లేదా నీలి రంగులో ఉంటాయి. అయినప్పటికీ నీలి రంగు పువ్వులతోనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ఆయుర్వేదంలో పలు రకాల ఔషధాలను తయారు చేయడంతోపాటు పలు వ్యాధులను నయం చేసేందుకు శంఖపుష్పి మొక్కను ఉపయోగిస్తుంటారు. ఈ మొక్కకు చెందిన తీగ, వేర్లు, ఆకులు కూడా ఉపయోగకరమే. అయితే సాధారణంగా ఈ మొక్కకు పూసే నీలి రంగు పువ్వులనే అధికంగా ఉపయోగిస్తుంటారు. ఈ పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి.

మెదడుకు టానిక్..: శంఖపుష్పి పువ్వులను వాడడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రతగా పనిచేస్తారు. ఏదైనా అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టగలుగుతారు. దీంతో ఆలోచనా శక్తి పెరుగుతుంది. పనిచేసే విషయాల్లో రాణిస్తారు. తెలివి తేటలు పెరుగుతాయి. మెదడు వికాసం చెంది యాక్టివ్‌గా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. బద్ధకం పోతుంది. ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తారు. మానసిక శక్తి పెరుగుతుంది. మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్నవారికి ఈ పువ్వులు చక్కని ఔధషంలా పనిచేస్తాయి. మానసికంగా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. శంఖపుష్పి మెదడుకు టానిక్‌లా పనిచేస్తుంది. మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా చూసుకోవచ్చు.

గాఢ నిద్ర కోసం..: శంఖపుష్పి పువ్వులను వాడితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మరుసటి రోజు ఉదయం ఉత్సాహంగా నిద్ర లేస్తారు. ఈ పువ్వుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. శంఖపుష్పి పువ్వుల్లో హైపో లిపిడెమిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పువ్వులను వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఎలా వాడాలి..?: శంఖపుష్పి పువ్వుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేలా చేస్తాయి. శంఖపుష్పిని వాడడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. ఇలా ఈ పువ్వులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఈ పువ్వులను ఎలా వాడాలంటే.. నాలుగైదు శంఖపుష్పి పువ్వులను తీసుకుని నీటిలో వేసి మరిగించి అనంతరం వడకట్టాలి. ఈ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే అందులో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగేయాలి. ఈ విధంగా శంఖపుష్పి పువ్వులను వాడుతుంటే ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు.

# గౌట్‌కు మందు కాకరకాయ



ప్రస్తుతం మనదేశంలో చాలామంది యూరిక్ ఆమ్లం సమస్యతో బాధపడుతున్నారు. మన శరీరంలో ప్యూరిన్ అనే మూలకం విచ్ఛిన్నం వల్ల యూరిక్ ఆమ్లం తయారవుతుంది. ఇది రక్తం ద్వారా కిడ్నీలకు చేరుతుంది. మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతుంది. అయితే, యూరిక్ ఆమ్లం మూత్రంలో బయటికి వెళ్లనప్పుడు శరీరంలో దాని పరిమాణం పెరుగుతూ వస్తుంది. దీనివల్ల కీళ్లనొప్పులు వస్తాయి. లేవడం, కూర్చోవడం కష్టమైపోతుంది. దీన్నే గౌట్ అని పిలుస్తారు. యూరిక్ ఆమ్లం పేరుకోవడం వల్ల గుండెజబ్బులు, అధిక రక్తపోటు, కిడ్నీలో రాళ్లు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలూ తలెత్తుతాయి. కాబట్టి, దీన్ని సరైన సమయంలో గుర్తించి అదుపులో పెట్టుకోవాలి. ఈ దిశగా కాకరకాయ జ్యూస్ మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఆహార విధానంలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి ముందు వైద్యుల సలహా తప్పనిసరి.

కాకరకాయ జ్యూస్ ప్రయోజనాలు ఏంటో చూద్దాం

యూరిక్ ఆమ్లం తగ్గింపులో కాకరలో ఔషధ గుణాలు అపారం. ఓ గ్లాసెడు కాకరకాయ రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ ఆమ్లం స్థాయిలు సహజంగానే తగ్గిపోతాయి. కాకరలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, కాల్షియం, బీటా కెరాటిన్ లాంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గౌట్ నివారణలో దోహదపడతాయి.

మధుమేహానికి మందుగా: మధుమేహం నియంత్రణలో కూడా కాకరకాయ ఎంతో ప్రయోజనకారి. విటమిన్ ఎ, సి, బీటా కెరాటిన్, ఇతర మినరల్స్, ఫైబర్ వల్ల ఇది ఇన్సులిన్‌లా పనిచేస్తుంది. రక్తంలో పెరిగే చక్కెర స్థాయుల నిర్వహణలో గొప్పగా ఉపయోగపడుతుంది.

ఎలా తీసుకోవాలి?: ప్రతిరోజూ పొద్దునే పరగడుపున ఓ సగం కప్పు కాకరకాయ జ్యూస్ తీసుకోవాలి. దీనికి సైంధవ లవణం, లేదంటే నిమ్మరసం కలుపుకొంటే చేదు తగ్గుతుంది. గౌట్, ఆర్థరైటిస్ సమస్యల విషయంలో కాకరకాయ జ్యూస్ మేలుచేస్తుంది. జ్యూస్ ఒక్కటి మాత్రమే కాకుండా, కాకరకాయతో రకరకాల కూరలు చేసుకుని తినడమూ మంచిదే. కాకరకాయ పొడి కూడా తీసుకోవచ్చు. దీనికోసం కాకరకాయను బాగా కడగాలి. ఆ తర్వాత దాన్ని ముక్కలుగా చేసి, నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత వాటిని నూరి పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని రోజూ పొద్దునే సగం టీస్పూన్ గానీ, టీస్పూన్ గానీ నీళ్లతో కలుపుకొని సేవించాలి.

# ట్రంప్ అధికారాలకు కత్తెర

ఢిల్లీ,: ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగుతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహార శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్యానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమీనియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడిం చింది. ఇరాన్



మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిగ్గ్÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

## చంద్రగిరి మండలంలో అర్ధరాత్రి ఏనుగుల బీభత్సం



తిరుపతి:తిరుపతి జిల్లా,చంద్రగిరి మండలం రంగంపేట దగ్గర నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రిమామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంటపొలాలపై దాడిచేసి పూర్తిగా ధ్వంసం చేసాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాల్లో భీకర శబ్దాలతో గింకరిస్తుండగా, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతుల మామిడి తోట, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. మూడు రోజులుగా నాగపట్లలోనే గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల అటవీప్రాంతంలోకి తరిమేందుకు, బాణా సంచా పేలుస్తూ, డప్పు శబ్దాలతో ప్రయత్నించారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు తెలియజేసారు.

# ఢిల్లీలో టీడీపీ ఆఫీస్

న్యూఢిల్లీ, : దేశ రాజధాని ఢిల్లీలో తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడుతున్నాయని నాడు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం దివంగత నందమూరి తారక రామారావు ఆవేదనకు లోనయ్యారు. అలాంటి పరిస్థితులను రూపుమాపి.. ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి పవర్ ఏమిటో చూపాలన్న కసితో సాగిన ఎన్టీఆర్? తెలుగు దేశం పార్టీ (టీడీపీ)పేరిట పార్టీని స్థాపించి సత్తా చాటారు.ఎన్టీఆర్ చేతుల్లో పురుడు పోసుకున్న టీడీపీ జెండా ఇప్పుడు ఢిల్లీ నడి వీధుల్లో రెపరెపలాడనుంది. అది కూడా ఢిల్లీలోని ఏదో మూల అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే? ఢిల్లీ నగరం నడిమధ్యలో సిటీ ప్రైమ్ లొకేషన్ లో టీడీపీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు వేగంగా అడుగులు పడుతున్నాయి.టీడీపీ ఆవిర్భవించి అప్పుడే నాలుగు దశాబ్దాలు గడిచిపోతున్నా? దేశ రాజకీయాల్లో చాలా సార్లు కీలక పార్టీగా పనిచేసినా.. ఇప్పటిదాకా దేశ రాజధాని నగరం ఢిల్లీలో పార్టీకి కార్యాలయం అంటూ లేదు. టీడీపీ వ్యవస్థాపకుడైన ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్ ను నిత్యం వినిపిస్తూ వస్తున్న టీడీపీ నేతలు? పార్టీకి ఢిల్లీలో కేంద్ర కార్యాలయం గురించి అంతగా పట్టించుకోలేదనే చెప్పాలి. అయితే తన నలభై ఏళ్ల ప్రస్థానంలో దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతంగా సాగుతున్న టీడీపీకి ఇప్పుడు ఢిల్లీలో కార్యాలయం కావాలని పార్టీ అధిష్ఠానం భావించింది. అనుకున్న వెంటనే ఆ విషయాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు వద్ద ప్రతిపాదించింది.

కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు ఊపిరిగా నిలుస్తున్న టీడీపీ అడగడమే ఆలస్యం అన్నట్లుగా కేంద్రం.. ఈ ప్రతిపాదనపై వేగంగా స్పందించింది. టీడీపీ ప్రతిపాదనను త్వరితగతిన పరిశీలించాలంటూ ఢిల్లీ సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది.వెరసి టీడీపీ ప్రపోజల్ ను తెరచిన ఢిల్లీ సర్కారు? శరవేగంగా దానిపై ఓ నిర్ణయం తీసుకుంది.

తాను చేసిన ప్రతిపాదనకు ఢిల్లీ సర్కారు నుంచి వచ్చిన స్పందనకు టీడీపీ ఓకే అనడమే ఆలస్యం క్షణాల్లో టీడీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇట్టే దక్కిపోతుంది. ఆపై కళ్లు మూసి తెరిచేలోగానే ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి ఆత్మ గౌరవాన్ని రెపరెపలాడించేలా టీడీపీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది.దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తున్న టీడీపీ.. ఢిల్లీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తోందని ఆ పార్టీ అధిష్ఠానం కేంద్రానికి ఓ ప్రతిపాదన పంపింది. పార్టీ కార్యాలయం కోసం 2 వేల చదరపు మీటర్ల స్థలం కావాలని కోరింది. కేంద్రం ఆదేశాలతో ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఢిల్లీ సర్కారు? దీన్ దయాళ్ మార్గ్ లో బీజేపీ కేంద్ర కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న 1,200 చదరపు మీటర్ల స్థలాన్ని గుర్తించింది.ఎలాంటి వివాదాలు లేని ఈ స్థలాన్ని టీడీపీకి తక్షణమే బదలాయించవచ్చని ఢిల్లీ చీఫ్ ఆర్కిటెక్ట్ కేంద్రానికి సిఫారసు చేశారు. ఈ విషయాన్ని టీడీపీకి చేరవేసిన కేంద్రం? తక్షణమే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరింది. వెరసి తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడిన అదే ఢిల్లీ నడి వీధుల్లో అదే తెలుగోడి ఆత్మ గౌరవం సగర్వంగా నిలవనుంది.

# ఢిల్లీలో అధికారం సాధ్యమేనా?

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకున్న ఏ నాయకుడికైనా ఢిల్లీ పీఠం ఒక తీపి కల. గతంలో కేసీఆర్ తన రెండో విడత పాలన చివరలో బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, చివరికి సొంత ఇలాకాలోనే పట్టు కోల్పోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తన మొదటి విడత పాలనలోనే.. అది కూడా పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బయటపెట్టారు. అయితే కేసీఆర్ ప్రస్థానానికి, రేవంత్ రెడ్డి ఆలోచనలకు మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ అండ. కేసీఆర్ శూన్యం నుంచి ఒక జాతీయ వేదికను నిర్మించాల్సి రాగా, రేవంత్ కేవలం ఉన్న పార్టీలోనే తన స్థాయిని పెంచుకుంటే సరిపోతుంది.రేవంత్ తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు. 2034లో అని చెబుతున్నారు. కేసీఆర్ తన రెండో పదవీకాలం ముగిసే వేళ జాతీయ రాజకీయాల గురించి గట్టిగా మాట్లాడటం మొదలుపెట్టారు. అప్పటికే పదేళ్ల పాలనపై వ్యతిరేకత మొదలైంది. కానీ రేవంత్ రెడ్డి తన మొదటి టర్మ్‌లోనే తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. ఇది ఒక రకంగా సాహసమే. నేను రెండు సార్లు సీఎంగా ఉంటాను, ఆ తర్వాతే జాతీయ రాజకీయాలకు వెళ్తాను అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. అయితే, పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యమంత్రి దృష్టి పాలన మీద ఉందా లేక వ్యక్తిగత ఎదుగుదల మీద ఉందా అని ప్రశ్నించే అవకాశం ఉంది.బీఆర్ఎస్ అనేది కేసీఆర్, ఆయన కుటుంబం చుట్టూ తిరిగే పార్టీ. అక్కడ నిర్ణయాధికారం ఒక్కరిదే. కానీ కాంగ్రెస్ అలా కాదు. ఇక్కడ అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత ఉంటుందో, గ్రూపు రాజకీయాలు కూడా అంతే బలంగా ఉంటాయి. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. కేసీఆర్‌కు పార్టీలో ఎదురులేకపోవడం ఒక ప్లస్ అయితే, రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం అతిపెద్ద బలం. కేసీఆర్ తన హయాంలో తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు. రేవంత్ రెడ్డి ఇంకా ఆ స్థాయికి చేరుకోవాల్సి ఉంది. పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయడం, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఆయన రెండోసారి ముఖ్యమంత్రి కాగలరు. ఒకవేళ సంక్షేమ పథకాల్లో విఫలమైతే, 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు ప్రాంతీయ సెంటిమెంట్‌కు ప్రాధాన్యత ఇస్తారు. తమ సీఎం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది.తెలంగాణ సమాజం తమ నాయకుడు తమ కోసమే పని చేయాలని కోరుకుంటుంది.

కేసీఆర్ ఎప్పుడైతే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టారో, అప్పుడే తెలంగాణ ఓటర్లు ఆయనకు దూరం కావడం మొదలైంది. రేవంత్ రెడ్డి ఈ పొరపాటు చేయకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలంటే, ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ తెలంగాణ ప్రజలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని భావిస్తే, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డికి బలమైన నెట్‌వర్క్, జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయాల్లో ప్రజా తీర్పు అత్యంత శక్తివంతమైనది. రేవంత్ రెడ్డి తన పాలనతో ప్రజలను మెప్పిస్తూ, ఢిల్లీ వైపు అడుగులు వేస్తేనే ఆయన కేసీఆర్ కంటే మెరుగైన ఫలితాలు సాధించగలరనేది ఎక్కువ మంది అభిప్రాయం.

# చేరేవారెవరురా? నిలిచేవారెవరురా?

హైదరాబాద్,: తెలంగాణలో బీఆర్ఎస్ లో కొంత అయోమయం నెలకొంది. నేతలు ఆ పార్టీలో చేరేందుకు కూడా ముందుకు రావడం లేదు. బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత బయటకు వచ్చి వేరే పార్టీ పెట్టడంతో కొంత రాజకీయంగా ఇబ్బందులున్నాయని చెప్పాలి. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుస్తుందన్న నమ్మకం లేకపోవడం వల్లనే చేరికలు లేవని ప్రత్యర్థి పార్టీలకు చెందిన సోషల్ మీడియాలో వార్తలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో చేరికలు లేవు. అలాగని వెళ్లిపోయే వారు లేరు. కొనసాగుతున్న వారు కూడా పెద్దగా అందరూ యాక్టివ్ గా లేకపోవడం కూడా చర్చనీయాంశమైంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు గడుస్తుంది. సహజంగా అధికార పార్టీపై వ్యతిరేకత ఉంటుంది కనుక బలమైన అపోజిషన్ పార్టీలో చేరే వారు ఎక్కువగా ఉంటారు. ఇంత ముందుగా ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ కన్ఫర్మ్ చేసుకోవడం కోసం ముందుగానే వచ్చి చేరతారు. ఇటీవల జీవన్ రెడ్డి చేరికను కొందరు ఉదహరించవచ్చు. కానీ కాంగ్రెస్ లో తనకు సరైన ప్రాధాన్యత లభించకపోవడం వల్లనే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారు కాని, లేకపోతే ఆయన కూడా చేరే వారు కారన్నది అందరూ ఒప్పుకుని తీరాల్సిన నిజం. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ లో ఏదో ఒక పదవి దక్కి ఉంటే చేరే వారా? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత ఎవరూ చేరలేదని ఆ పార్టీ నేతలు కొంత సర్ది చెప్పుకుంటున్నా.. కొత్తగా వచ్చి చేరే నేతలేరన్నదే ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. ఉప ఎన్నికలు అన్నింటిలోనూ ఓటమి చవి చూసిన ఆ పార్టీపై నమ్మకం లేకపోవడంతో పాటు పార్టీ అధినేత కేసీఆర్ బయటకు రాకపోవడం కూడా ఒక కారణమని అని అంటున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఎంతగా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్నప్పటికీ కేసీఆర్ కు వచ్చిన మైలేజీ రాదన్నది వాస్తవమని పార్టీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకూ అనేక నియోజకవర్గాల పరిధిలోని నాయకులు కూడా చేరికలను ప్రోత్సహించడం లేదన్న అభిప్రాయమూ ఉంది. మొత్తం మీద బీఆర్ఎస్ లో చేరేవారు లేరు. వెళ్లేవారు లేరు. కొత్త ముఖాలకు కనిపించేందుకు అవకాశమే కనిపించడం లేదు.

# కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..!

న్యూఢిల్లీ: వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్‌లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్ లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్ లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్టర్స్‌కుసమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు.

# అమెరికాను లైట్ తీసుకుంటున్న ఇండియా

న్యూఢిల్లీ, : అమెరికా.. ఈ పేరు వింటేనే ఒకప్పుడు భారత దేశ పరిపాలకులు భయపడేవారు. అమెరికా నుంచి ఎవరైనా ప్రతినిధులు వస్తున్నారంటే అలర్ట్ అయిపోయేవారు. అమెరికా అధ్యక్షుడు గనుక ఇండియాలో పర్యటిస్తే.. దేవుడు భూమ్మీదకి వచ్చినట్టు భావించేవారు. సకల సౌకర్యాలు చేసేవారు. గొప్ప గొప్ప సత్కారాలు చేపట్టేవారు. అమెరికా చెప్పినట్టు వినేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమెరికా చేతిలో కీలు బొమ్మలాగా వ్యవహరించేవారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అమెరికా చెప్పినట్టు వినడం కాదు కదా.. అమెరికా గట్టిగా హెచ్చరికలు చేసిన సరే వినిపించుకునే పరిస్థితి లేదు. అమెరికా ఏం చేసినా సరే నిశ్శబ్దంగా ఉండే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పుడు ఇండియా మారిపోయింది. నయా ఇండియా గా అవతరించింది. భయపడే స్థాయి నుంచి నిలబడే స్థాయికి.. వణికే స్థాయి నుంచి ఎదురు చెప్పే స్థాయికి ఎదిగింది. అందువల్లే ఇండియా విషయంలో అమెరికా ఒకప్పటి మాదిరిగా ఉండడం లేదు. ఒకప్పటి స్థాయిలో బెదిరింపులకు పాల్పడటం లేదు.మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతోంది. పరిణమాలు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ దిగుమతి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల భారత్ లాంటి అతిపెద్ద దిగుమతి దారు దేశానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. దీనివల్ల దేశంలో ధరల స్థాయి నిరంతరం పెరుగుతోంది.. ఇది ఎక్కడదాకా వెళ్తుందో తెలియదు. పైగా చమురు కంపెనీలకు ప్రతిరోజు 750 కోట్ల వరకు నష్టం వస్తుంది. కొనుగోలు ధరలు పెరిగిపోవడం.. ఇతర ఖర్చులు అధికంగా కావడంతో కంపెనీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అంతకుముందే కంపెనీలకు రోజుకు 1000 కోట్ల వరకు నష్టాలు వచ్చాయి. ఈనెల 15న లీటర్ పెట్రోల్, డీజిల్ మీద మూడు రూపాయలు చొప్పున పెంచడంతో.. కొంతవరకు నష్టాలు భర్తీ అయ్యాయి.క్రూడ్ ఆయిల్ విషయంలో భారత్ ముందుచూపుతో వ్యవహరించింది. రష్యా నుంచి గతంలో భారత్ ముడి చమురు కొనుగోలు చేసేది. ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్ తో యుద్ధం వల్ల రష్యా నుంచి ముడి చమురు భారత్ కొనుగోలు చేయడాన్ని అమెరికా ప్రశ్నించింది. ఈనెల 16 వరకే ముడి చమురు కొనుగోలు చేయాలని డెడ్లైన్ విధించింది. ఇప్పటికే ఆ గడువు ముగిసిపోయింది. ఆయనప్పటికీ రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడం ఆగదని పెట్రోలియం శాఖ కార్యదర్శి సుజాతశర్మ ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఇకపై కూడా భారతదేశానికి రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏప్రిల్ 17 ముందు వరకు నౌకలలో లోడ్ చేసిన రష్యా చమురును ఏ దేశమైనా కొనుగోలు చేయవచ్చు. ఆంక్షలు ఉండవు. పైగా గతంలో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసింది. ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తుంది.. అయితే భారత్ నుంచి ఈ ప్రకటన రావడంతో.. రష్యా ముడిచమురు కొనుగోలు చేయడానికి మినహాయింపులను అమెరికా మరో 30 రోజులపాటు పెంచడం ఇక్కడ విశేషం.

## విశాఖలో మూడు కీలక ప్రాజెక్టులు

విశాఖపట్టణం: విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపి శ్రీ భరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జివిఎంసి ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు. రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మధురవాడ జోన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ.725.18 కోట్లు, బల్క్ అండ్ సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని తెలిపారు.

# లోకల్ పోరుకు వ్యూహాలు




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజక వర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు. మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలి. ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవు తుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది. ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందు తున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు. తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజక వర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది. ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందుకే అన్ని పార్టీలు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసు కుని నేతల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని నిర్ణయించాయి. విభేదాల ఫలితం ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడకూడదని, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్ ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేసుకుని నేతల మధ్య, క్యాడర్ లో నెలకొన్న విభేదాలు తొలగించే ప్రయత్నాలు చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకత్వంలో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలు కొంత అలజడికి కారణమయ్యాయి.

## మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

మహబూబ్ నగర్ : కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ. 4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపే ట, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతు ంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు ఎస్ఈఐఏఏంకు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగి ంచిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ. 4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి. డిసెంబర్ 8న కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి. ఆ నివేదికల ఆధారంగానే ఎస్ఈఐఏఏం సమావేశం జరిగింది.

## సమగ్ర శాసనం కోసం

రాష్ట్రంలో 1930వ దశాబ్ధం ప్రారంభం నుండి పారిశ్రామికాభివృద్ధి క్రమంగా వేగం పుంజుకుంది. పరిశ్రమల సంఖ్యతో పాటే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే, దీనికి తగ్గట్టుగా కార్మికుల రక్షణకు సమగ్రచట్టాలు లేవు. ఫ్యాక్టరీ యాక్టు వంటి ఒకటి, రెండు చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలైన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. వేతనాల నుండి పని ప్రదేశాల్లో భద్రత వరకు ఒక్క అంశం కూడా అమలులోకి రాకపోవడంతో కార్మికుల పరిస్థితి ఘోరంగా మారింది. దీంతో కార్మికులను సంఘటితం చేసి, వారి హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర శాసనం రూపొందించాలన్న డిమాండ్ ప్రారంభమైంది. సహజంగానే కమ్యూనిస్టు పార్టీ ఈ కృషిని భుజాన వేసుకుంది. కార్మికుల్లో విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించింది. కార్మికులకు భద్రత, కనీస సౌకర్యాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, పనిగంటలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు తదితర అంశాలను ఈ శాసనం చేర్చాలంటూ కమ్యూనిస్టులు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. దీంతో 1937లో మద్రాసు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రివర్గం కార్మిక సమస్యలపై తన ఆలోచనలను తెలియచేస్తూ ఒక ప్రకటన చేసింది. కార్మిక వివాదాల్లో ఇరు పక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిలో పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేయాలని, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని, తక్షణమే ప్రత్యక్ష ఆందోళనలకు దిగకూడదని కూడా సూచించింది. అయితే, ఈ ప్రకటన కార్మికులకు ఎటువంటి ఊరట ఇవ్వలేకపోయింది. యజమానులు కూడా ప్రభుత్వ ప్రకటనను ఖాతరు చేయకుండా కార్మికులను దోపిడి చేసేందుకే ప్రయత్నించారు. అనేక చోట్ల కార్మిక సంఘాలను సైతం గుర్తించలేదు. దీంతో కార్మికుల ఆందోళనలు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికెళ్లినా ఈ చట్టం గురించే కార్మికులు ప్రశ్నించేవారు. ఈ పరిస్థితుల్లో కార్మిక శాసనం రూపొందించడానికి మద్రాసు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అప్పటికే ఉనికిలో ఉన్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చించుకుని విశాల ప్రాతిపదికన ఒక నివేదికను రూపొందించారు.

# 'సాక్ ఐ'తో సోషల్ మీడియా అస్త్రం

హైదరాబాద్, : సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం దొరికింది. ఏఐ సాయంతో నెట్టింట ఫేక్ ప్రచారాలు చేసేవారు, సంఘ విద్రోహ శక్తులపై ఎప్పటికప్పుడు డేగ కన్ను పెట్టనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 'సాక్ ఐ' పేరుతో ఏఐ యాప్‌ను ప్రారంభించారు. తాజాగా ఈ సాక్ ఐ యాప్.. దానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసులు.. వెల్లడించారు. ఈ సాక్ ఐతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీపీ సజ్జనార్ వెల్లడిం చారు. ప్రస్తుతం సమాజం అంతా సోషల్ మీడియాలోనే మునిగిపో యింది. ఏ విషయమైనా, మనఆలోచనలుఅయినా సోషల్ మీడియా లో పంచుకోవడం అందరికీ అలవాటుగా మారిపోయింది. అయితే ఇప్పుడు ఈ సోషల్ మీడియాలోనే ప్రమాదకరమైన సమాచారం, విద్వేషాలను రెచ్చగొట్టడం, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధిం చిన విషయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం నేరాలను అరికట్టడం, నిందితులను పట్టుకోవడం కోసం.. పోలీసులు సోషల్ మీడియాను జల్లెడ పడుతున్నారు. కానీ రకరకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, వాటిలో కోట్ల కొద్ది అకౌంట్లను తనిఖీ చేయడం పోలీసులకు వీలు కావడం లేదు. ఈ నేపథ్యంలోనే హైద రాబాద్ పోలీసులు సరికొత్త టెక్నాలజీని ఉపయోగించుకుంటు న్నారు. ప్రస్తుతం టెక్నాలజీలో శరవేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు రెడీ అయ్యారు. సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్ ( సాక్ ఐ ) పేరుతో సరికొత్త ఏఐ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించేలా.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిని గుర్తించడం, అసాంఘి క శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేలా ఈ అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం తయారు చేసింది. సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు గతంలో భారీగా సిబ్బంది అవసరం అయ్యేదని.. గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేద ని పేర్కొన్న పోలీసులు.. ఈ సాక్ ఐ ఏఐ యాప్ ద్వారా ఇక నుంచి అన్నీ ఆటోమేటిక్‌గా జరగనున్నాయి. ఈ సాక్ ఐలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్.. ఇంటర్నెల్ ఇంటెలిజెన్స్ డేటా, హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రధాన సంఘటనలకు సంబంధించిన వివరాలను ఒకే చోటుకు తీసుకువచ్చి.. అధికారులకు పూర్తి అవగాహన కల్పిస్తుంది. ఇక సాక్ ఐని.. ప్రయోగాత్మక పరీక్షించగా.. అద్భుతమైన పనితీరును కనబరిచినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 విద్వేషపూరిత, మతపరంగా రెచ్చగొట్టేలా చేసిన అంశాలను.. గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా అకౌంట్లలో ఉన్న 126 పోస్టులను ఈ సాక్ ఐ గుర్తించింది. ఇలాంటి కంటెంట్‌ను సోషల్ మీడియా నుంచి తక్షణమే తొలగించడం ద్వారా నగరంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడటమే కాకుండా.. విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తించడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ సాక్ ఐ సిస్టమ్ దృష్టి పెడుతుందని పోలీసులు వెల్లడించారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్.. సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి వాటిని కూడా గుర్తించి అలర్ట్ చేస్తాయని తెలిపారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల తీవ్రత ఆధారంగా వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి.. అభ్యంతరకర పోస్టులను తొలగించేలా ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు అలర్ట్ ఇస్తుందని పేర్కొన్నారు. వివాదాస్పద సోషల్ మీడియా పోస్టులను మళ్లీ మళ్లీ షేర్ చేసే వారిని.. గుర్తిస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతీ ఫిర్యాదుకు ఒక యునిక్ ట్రాకింగ్ నంబర్ ఉంటుంది. ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎండ్ టు ఎండ్ మానిటరింగ్ చేస్తారు. హైదరాబాద్‌లో రోజూ జరిగే ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, మతపరమైన ఊరేగింపులపై ముందస్తు నిఘా ఉంచేందుకు ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్ ఏర్పాటు చేశారు. ఆయా కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ.. ఏదైనా ముప్పు ఉంటే పోలీసులను అలర్ట్ చేస్తుంది. ఈ అత్యాధునిక సాక్ ఐ ఏఐ టెక్నాలజీతో పోలీసులపై పనిభారాన్ని తగ్గించడమే కాకుండా.. నేరాలకు అడ్డుకట్ట వేయడంలో సమూల మార్పులు వస్తాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించేందుకు.. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేందుకు దీన్ని రూపొందించామని తెలిపారు. ప్రస్తుత టెక్నాలజీ కాలానికి అనుగుణంగా నేరగాళ్లు.. సోషల్ మీడియాలో అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో.. ఈ టెక్నాలజీతో వారిని సమర్థంగా ఎదుర్కొంటామన్నారు.

# లింగాల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

### ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



లింగాల: నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని లింగాల మండల కేంద్రంలో పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మొక్కజొన్న, వరి కొనుగోళ్లకు రైతులకు అందుతున్న సేవలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, గ్రామ స్థాయిలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంపై ప్రత్యక్షంగా పరిశీలించి, వివరాలను సేకరించి, సమీక్ష నిర్వహించి సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ముందుగా లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విధానం, తూకం ప్రక్రియ,

నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా సరైన ప్రణాళికతో కొనుగోళ్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ధాన్యం తరలింపు ప్రక్రియకు అవసరమైన లారీలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తార్పులు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం లింగాల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్లు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన కలెక్టర్ పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సహాయం, నిర్మాణ సామగ్రి లభ్యత, పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు సామాగ్రి, ఇసుక, ఇతర అవసరమైన నిర్మాణ సామగ్రి సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, పనులు మధ్యలో నిలిచిపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చివరి దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అధికారులను గుర్తించి రెండోవ విడతలో ప్రభుత్వం అందజేసే ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పోషణ పక్వాడ లో అంగన్వాడీ ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



రాయికల్:ఐ సిడి ఎస్ జగిత్యాల ప్రాజెక్టు రాయికల్ మండలం అల్లీపూర్ సెక్టార్ లోని కుమ్మరిపల్లి గ్రామ పంచాయతీ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన, సి డి పి ఓ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడలో అంగన్వాడి ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిరహించడం జరిగింది. సి డి పి ఓ మమత మాట్లాడుతూ 2018 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోషణ పక్వాడ ప్రోగ్రాం భారతదేశ జనాభా ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుంది. విహెచ్‌ఎస్ఎన్‌డి(విలేజ్ హెల్త్, శానిటే షన్ న్యూట్రిషన్ డే)లో పిల్లలు బరువులు ఎత్తులు చూసి లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ గురించి తెలపడం జరిగింది. పిల్లల ఆరోగ్యం మరియు మెదడు ఎదుగుదల చాలా కీలకం. పోషకాహార అలవాట్లలో మార్పు తీసుకురావడానికి సమతుల్య ఆహారం వివిధ రకాల పోషకాలు కలిగిన తరచూ చిన్న భోజనాలు, 2-3 గంటలకు ఒకసారి చిన్న భోజనాలు ఇవ్వడం. ఇది శక్తి స్థాయిలను నిర్వహించ డానికి మరియు పెరుగుదలకు సహాయపడుతుంది. నీటి సమతుల్యత కొరకు, తరచూ నీరు, పాల, మరియు పండ్లరసాలుఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా 0-6 సం॥ పిల్లల తో బొమ్మల తయారీ ఇసుకతో ఆటలు ఇలాంటి స్వేచ్ఛయుత ఆటల వలన శారీరక ఆరోగ్యం, మెదడు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 3-6 సం॥, పిల్లలకు వారి అభివృద్ధి నివేదికలు గుర్తించి స్టార్స్ ఇచ్చి ప్రతి ఇయర్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తామన్నారు. ఇది తల్లి తండ్రుల సమక్షంలో పిల్లలు నేర్చుకున్న వాటితో ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోషకాల గురించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తర్వాత పిల్లలతోగ్రాడ్యుయేషన్ డే, అన్న ప్రసన్న చేసి గుడ్లు, బా లమృతంటీ హెచ్ ఆర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో శ్రీయుత సర్పంచ్ గుమ్మడి సంతోష్, ఉప సర్పంచ్ కోడిమ్యాల శేఖర్, సూపర్వైజర్ రాధ, ఏ ఎన్ ఎం ప్రశాంతి, పంచాయతీ సెక్రటరీ కె. రాజేష్, కరోబార్ రాజేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, ఆశ వర్కర్ సుష్మ, రజిత అంగన్వాడీ టీచర్స్ పద్మావతి, వనిత, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్‌లో సైలెంట్ వార్?



దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్ లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.

# ఇక తమిళం వంతు!



దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.

# ఈసారి టైగర్ కాదు డ్రాగన్: అల్లు అర్జున్



టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సీనియర్ నటి ఖుష్బూ చెప్పిన విషెస్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఎన్టీఆర్‌కు అల్లు అర్జున్ చాలా ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలిపారు.

"హ్యాపీ బర్త్‌డే బావా.. ఈసారి వచ్చేది టైగర్ కాదు.. డ్రాగన్. ప్రతి షాట్‌లోనూ నిప్పులు చెరిగావ్" అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. ఎన్టీఆర్ రాబోయే చిత్రం 'డ్రాగన్' గ్లింప్స్‌ను ప్రశంసిస్తూ బన్నీ చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరోవైపు సీనియర్ నటి ఖుష్బూ కూడా తారక్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

"నా ప్రియమైన, నాకు అత్యంత ఇష్టమైన తారక్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీకు సంతోషం, విజయం, మంచి ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నాను. ఆ దేవుడు మిమ్మల్ని ఎల్లప్పుడూ ఆశీర్వదించుగాక. లవ్ యూ కన్నా!! నా హీరో, నా తారక్, నా డ్రాగన్" అంటూ ఆమె భావోద్వేగంగా ట్వీట్ చేశారు.


# 'డ్రాగన్'లో 'లూగర్'గా ఎన్టీఆర్..




యంగ్ టైగర్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ పాత్ర పేరును 'లూగర్'గా పరిచయం చేయడం అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను శక్తివంతంగా తీర్చిదిద్దుతారన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో రాకీ, 'సలార్'లో దేవా మాదిరిగానే 'డ్రాగన్'లో ఎన్టీఆర్ పాత్రకు 'లూగర్' అనే పేరు పెట్టడం వెనుక ప్రత్యేక కారణం ఉన్నట్టు తెలుస్తోంది. 'లూగర్' అనేది ప్రపంచ యుద్ధాల కాలంలో జర్మనీ సైన్యం వాడిన ఒక క్లాసిక్ పిస్టల్. అత్యంత కచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి ఇది ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక వ్యక్తిలా కాకుండా, శత్రువులను వేటాడే ఆయుధంలా ఉండబోతోందని ఈ పేరు సూచిస్తోంది. కాగా, ఈ విషయంపై చిత్రబృందం ఇంకా స్పందించలేదు. అయితే, 'లూగర్' అనే పదానికి గూగుల్, వీకిపిడియాలో మాత్రం ఈ అర్థం కనిపిస్తుంది.

ఈ చిత్రం 1967 కాలం నాటి అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో సాగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లాక, ఓపియం వ్యాపారం 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ', 'గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ'లుగా విడిపోతుంది. ఈ రెండు కంపెనీల మధ్య ఆధిపత్య పోరు, రక్తపాతం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ఎన్టీఆర్ 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ'కి చెందిన 'అసాసిన్-ఇన్-చీఫ్'గా కనిపించనున్నారు.

ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత కథానాయికగా నటిస్తుండగా, నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్' అనే కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది.




# త్రిష కెరియర్ ను 'విశ్వంభర' పరిగెత్తిస్తుందా?



త్రిష .. దాదాపు పాతికేళ్ల కెరియర్ ను చూసిన నాయిక. తెలుగు .. తమిళ భాషల్లో స్టార్ డమ్ ను చూసిన బ్యూటీ. అలాంటి త్రిషకి ఆ మధ్య కాలంలో అవకాశాలు తగ్గుతూ వెళ్లాయి. ఆ సమయంలో ఆమె నాయికా ప్రధానమైన కథలను చేస్తూ వెళ్లింది. ఆ క్రమంలో 'రాంగీ' 'ది రోడ్' '96' వంటి సినిమాలు ఆమె కెరియర్ ను మరికాస్త ముందుకు నడిపించాయి. ఈ నేపథ్యంలోనే త్రిషను సినిమా ఫంక్షన్ కి సంబంధించిన ఒక వేదికపై చూసి అందరూ షాక్ అయ్యారు. అందుకు కారణం గతంలో కంటే ఆమె ఇప్పుడు మరింత గ్లామరస్ గా ఉండటమే. త్రిష గురించి .. ఆమె గ్లామర్ గురించి సోషల్ మీడియాలో సందడి సాగింది. దాంతో ఆమెకి మళ్లీ పెద్ద బ్యానర్ల నుంచి .. సీనియర్ స్టార్స్ సినిమాల నుంచి కాల్స్ వెళ్లడం మొదలైంది. అలా ఆమె రజనీకాంత్ కమల్ వంటి సీనియర్ స్టార్స్ సరసన..విజయ్ - అజిత్ వంటి స్టార్స్ జోడీగా మెరిసింది. గ్లామర్ పరంగా త్రిష ఆ సినిమాలకి చాలా హెల్ప్ అయింది. కానీ ఆ సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం ఆమె అభిమానులను నిరాశ పరిచింది. ఈ క్రమంలోనే తమిళంలో ఆమె సూర్య సినిమా 'కరుప్పు'లో నటిస్తోంది. ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న .

ఈ సినిమాకి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'విశ్వంభర'లో కనిపించనుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ వయసులోను గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసిన త్రిషకు ఇప్పుడు ఒక పెద్ద హిట్ అవసరం. ఆమె కోరుకుంటున్న విజయాన్ని 'విశ్వంభర' అందిస్తుందా? ఆమె కెరియర్ ను పరిగెత్తిస్తుందా? అనేది చూడాలి.

# మనిషే చరిత్ర నిర్మాత




ఒకప్పుడు ఇతర జంతువులతో పాటు అడవుల్లో నివశించి, తన మేధో శక్తితో ఆధునిక మానవుడిగా ఎదిగిన వైనాన్ని వివరించే శాస్త్రాన్ని మానవ శాస్త్రం అంటారు. చరిత్ర క్రమాన్ని వివరించడానికి ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఆంత్రోపాలజీ (మానవ శాస్త్రం) అనేది ప్రాచీన, ప్రస్తుత మానవ ప్రవర్తన, జీవశాస్త్రం, సంస్కృతులు, భాషాశాస్త్రాల గురించి అధ్యయనం చేస్తుంది. ఆంత్రోపాలజీ చదవడం వల్ల వైద్యం, ప్రజారోగ్యం, వ్యాపారం, పర్యావరణ పరిరక్షణ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఫోరెన్సిక్, మ్యూజియం వంటి రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మానవ శాస్త్రము ఒక జీవ శాస్త్రం మాత్రమే కాక ప్రపంచంలో వేర్వేరు జాతుల, తెగల ప్రజలు, వారి మధ్య చారిత్రాత్మకంగా ఏర్పడిన భేదాలను కూడా తెలిపే సాంఘిక శాస్త్రం కూడా. మానవ శాస్త్రజ్ఞులు అనేక ప్రాంతాలలో పరిశోధనలు చేసి ప్రజలు ప్రస్తుతం ఎలా జీవిస్తున్నారో, పూర్వం ఎలా జీవించేవారో పురావస్తు శాస్త్రము ప్రకారంగా అధ్యయనం చేస్తారు. ఈ అధ్యయనాలు ఆధునిక నగరాల నుంచి పల్లెటూర్లు, అడవిలో నివసించే తెగల దాక విస్తరిస్తూ ఉంటాయి. వివిధ సమూహాల్లో జనం సమయాన్ని, స్థలాన్ని, జీవన శైలిని ఎలా అవగాహన చేసుకున్నారో, ఈ అధ్యయనాలు పరిశీలిస్తాయి. అమెరికన్ ఆంత్రోపోలాజికల్ అసోసియేషన్ 2015లో జాతీయ ఆంత్రోపాలజీ దినోత్సవాన్ని ప్రారంభించింది. మరుసటి సంవత్సరం, వారు దానిని ప్రపంచ ఆంత్రోపాలజీ దినోత్సవంగా మార్చారు. ఆంత్రోపాలజీ ఒక దేశానికి మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచానికి ముఖ్యమైనది. ఇందులో పురావస్తు శాస్త్రం చాలా ముఖ్యమైంది. సహజంగా ఇది ప్రతి ఏటా ఫిబ్రవరి మూడవ గురువారం వస్తుంది. ఈ లెక్క ప్రకారం ఈ ఏడాది  న వచ్చింది. మనిషి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ఆధునిక మానవుడిగా ఎదిగాడు. దీనికోసం ఎన్నో పోరాటాలు చేశాడు. మరెన్నో రాజ్యాలను ఆక్రమించు కున్నాడు. మత భావనలను దాటి సైన్స్‌లో ఎన్నో ఆవిష్కరణలు చేశాడు. ఎన్నో వ్యాధులకు నివారణ మార్గాలు కనిపెట్టాడు. ప్రతి పూర్వ తరం తర్వాత తరానికి అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని వారసత్వంగా ఇచ్చింది. సైన్స్ అభివృద్ధితో దేశాల మధ్య సరిహద్దులు తొలిగాయి. కొత్త అవకాశాలు వచ్చాయి.

సృజనాత్మకత ప్రతి రంగంలో పెరుగుతుంది. కొత్త నైపుణ్యాలు అవసరం ఏర్పడుతుంది. మకొన్ని సవాళ్లు కూడా ఈ క్రమంలో ఎదురౌతున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ రాజ్యమేలుతున్నది. ఇంకా కొన్ని దేశాల పాలకులు సంకుచిత భావనలతోనే ప్రజలను పాలిస్తున్నారు. ఇంకా ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు ఎక్కడో ఒక చోట ఆవరిస్తూనే ఉన్నాయి. ఒకవైపు పెరుగుతున్న మతోన్మాదం, మరోవైపు వాతావరణ కాలుష్యం ప్రపంచాన్ని తిరోగామి దిశలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మనిషి తన చరిత్రను పురోగామి దిశలో పయనింపజేయడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటాడనేది ఒక ఆసక్తికరమైన ప్రశ్న అవుతుంది.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.